



## ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

గోదావరిఖని, ఫిబ్రవరి 7: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జేవీ చలపతిరావు పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ స్థానిక కార్యాలయంలో జరిగిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేసున్నదని, భారత రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తూ, ప్రజల మధ్య భావోద్వేగాలను రెచ్చగొడుతుందన్నారు. మతం వ్యక్తిగతమని, మతం పేరుతో రాజకీయాలు చేయడం తగదన్నారు. కులం, మతం, ప్రాంతం పేరుతో పాలక వర్గ పార్టీలు ప్రజల ఆలోచనలు వక్రమార్గం పట్టిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ పార్టీ జిల్లా నాయకులు ఈ నరేశ్, ఐఎఫ్టీయూ జాతీయ ప్రధానకార్యదర్శి టీ శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఐ కృష్ణ, ఎం శ్రీనివాస్, ఏ వెంకన్న, ఈ రామకృష్ణ, మెరుగు చంద్రయ్య, కొల్లూరి మల్లేశ్, ఈ రాజేందర్, గుండేటి మల్లేశం, తదితరులు ఉన్నారు.

## మోడల్ స్కూల్ సందర్శన

సుల్తానాబాద్ రూరల్, ఫిబ్రవరి 7: గర్రెపల్లిలోని తెలంగాణ మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీని శుక్రవారం పెద్దపల్లి జిల్లా కోర్టు, సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవ అధికార కార్యదర్శి పెద్దపల్లి జిల్లా (డీఎల్ఎస్కే ) కే స్వప్న రాణి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ ,తరగతి గదులు, విద్యాబోధన, మధ్యాహ్న భోజనం నిర్వహణ, ప్రయోగశాలను, గ్రంథాలయంలో తోపాటు వివిధ మౌలిక వసతులు పరిశీలించారు. అనంతరం సలహాలు, సూచనలు చేశారు. ఇక్కడ పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ వై. కొండయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఐడెంటిటీ కార్డుల పంపిణీ

ఓదెల, ఫిబ్రవరి 7: హరిపురం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ అక్షర, నారాయణ ఫౌండేషన్ ప్రతినిధులు ఐడెంటింటీ కార్డులను తయారు చేయించి శుక్రవారం పాఠశాలలో అందజేశారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రోత్సహిస్తున్న ఆయా సంస్థల ప్రతినిధులకు హెచ్ఎం మహేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాస్, ప్రదీప్, భూమేష్, ఉపాధ్యాయులు సూత్రాల శ్రీనివాస్, పావని, హేమలత, హైమావతి, తోట రాజు తదితరులు పాల్గొన్నారు.

## వరి పంటల క్షేత్ర పరిశీలన

అంతర్గాం, ఫిబ్రవరి 7: మండలంలోని పలు గ్రామాలలో రైతులు సాగు చేస్తున్న వరి పంటలను మండల వ్యవసాయ అధికారి సతీశ్ శుక్రవారం క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ప్రాథమిక దశలోనే కాండం తొలిచే పురుగు, అగ్గితెగులు గుర్తించినట్లు ఆయన తెలిపారు. యాసంగి వరి పంటలో ఇవి అధికంగా వస్తాయని తెలిపారు. నివారణ చర్యలపై రైతులకు సూచనలు చేశారు. కాండం తొలిచే పురుగు నివారణ కోసం రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ జాగ్రత్తలు పాటిస్తే పంట దిగుబడి ఆశించినట్లు వస్తుందని తెలిపారు. పంటల సాగులో వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలనారు. ఆయన వెంట కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## తహసీల్దార్‌ను సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 7 : తహసీల్దార్ రాంచందర్ రావును బీఆర్ఎస్ నాయకులు సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. పెండింగ్ సమస్యలు తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని, తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు, బోయిన రాజమల్లయ్య, శీలం శంకర్, తాత సదానందం తో పాటు పలువురు పాల్గొన్నారు.

## సీనియర్ న్యాయవాదిపై దాడి అమానుషం

మంథని, ఫిబ్రవరి 7: ప్రముఖ సీనియర్ న్యాయవాది గంధం శివ పైన హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డితో పాటు కొంత మంది దాడి చేయడం అమానుషమని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మంథనికి చెందిన హైకోర్టు న్యాయవాది ఇనుముల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. న్యాయవాదిపై దాడి చేసిన తీరుపై ప్రభుత్వం స్పందించి నిందితులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# రివ్యూ మీటింగ్‌లో రియల్ ఎస్టేట్ ప్రచారం

### గద్దలపల్లి పీహెచ్‌సీలో ఘటన

మంథని రూరల్, ఫిబ్రవరి 7: ప్రభుత్వ దవాఖానలో వైద్య సిబ్బందితో నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లో కొంతమంది రియల్‌ఎస్టేటర్లు వ్యాపారానికి సంబంధించి ప్రచారం చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటన పెద్దపల్లి జిల్లా మంథని మండలం గద్దలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. నెలవారి రివ్యూ మీటింగ్‌లో భాగంగా గద్దలపల్లి పీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ సృజన్ నేతృత్వంలో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలతో శుక్రవారం సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. రివ్యూ మీటింగ్‌ను పక్కనపెట్టి.. యాదగిరిగుట్టకు చెందిన శుభమస్తు రియలస్టేట్ కంపెనీ ప్రతినిధుల వ్యాపార ప్రచారానికి అవకాశం కల్పించారు. దీంతో వారు కంపెనీ కరపత్రాలను వైద్య సిబ్బందికి పంపిణీ చేశారు. ప్రభుత్వ కార్యక్రమం జరుగుతుండగా.. ఇలా ప్రైవేట్ వ్యక్తులు వారి వ్యాపారానికి అనువుగా మా ర్చుకున్న తీరు చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై వైద్యాధికారి సృజన్‌ను వివరణ కోరగా, తాము రివ్యూ కార్యక్రమం నిర్వహిస్తుండ గా.. రిక్వెస్ట్ చేస్తే ఐదు నిమిషాలు తమ సిబ్బందితో మాట్లాడేందుకు వారికి అవకాశం కల్పించినట్లు తెలిపారు.


వైద్య సిబ్బందికి తమ వ్యాపారం గురించి వివరిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు



గద్దలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి అందజేసిన శుభమస్తు కంపెనీ బ్రోచర్

## కులగణనలో క్రైస్తవులు లేకపోవడం కుట్ర

జ్యోతినగర్, ఫిబ్రవరి 7: కుల గణనలో క్రైస్తవులను నమోదు చేయ కపోవడం ప్రభుత్వ కుట్ర అని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి నాయకులు ఆరోపించారు. శుక్రవారం ఎన్టీపీసీలో జరిగిన రిజర్వేషన్ పరిరక్షణ సమితి సమావేశంలో వారు మాట్లాడారు. హిందువులుగా జీవిస్తున్న ఎస్సీ హక్కులను, అవకాశాన్ని కొల్లగొట్టి కన్వర్ట్ అయిన బీసీ సీ క్రైస్తవులకు కట్టబెట్టె కుట్రగా కులగణన ఉందన్నారు. మళ్లీ ఎస్సీల జనాభాను లెక్కించి కన్వర్ట్ అయిన వారి జనాభాను దళితుల నుంచి వేరుచేసి ఎస్సీలకు రాజ్యాగం కల్పించిన హక్కులను కాపాడాలన్నారు. రాజ్యాంగంలోని 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకోని ఏబీసీడీ వర్గీకరణలో కన్వర్టెడ్ క్రైస్తవులకు బీసీ సీ అవకాశం ఇవ్వొందన్నారు. ఇక్కడ ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు భూషిపాక సంతోశ్, ఉపాధ్యక్షుడు గొర్రె రాజు, దళిత సంఘాల నాయకులు మిట్టపల్లి సతీశ్‌కుమార్, వినయ్, కాలా, శ్రీకాంత్, రమేశ్, కార్తీక్ ఉన్నారు.

## పెంచికల్ పేటలో రోడ్లు, మురికి కాలువల సర్వే

కమాన్‌పూర్, ఫిబ్రవరి 7 : పెంచికల్‌పేటలో రోడ్లు, మురికి కాలువలు నిర్మాణానికి సింగరేణి సివిల్ డిపార్ట్‌మెంట్ ఇంజినీర్ గ్రామానికి వచ్చి సర్వే నిర్వహించారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని పల్లె నారాయణ ఇటీవల జీఎంకు విన్నవనించారు. ఇక్కడ సింగరేణి సివిల్ ఇంజనీర్ శ్రీరాముల నరేశ్, ఇరుగురాళ్ల శంకర్, జంపాల శ్రీనివాస్, గండికోట రాము, పెగడ సతీశ్, మబ్బు హరికృష్ణ, కొత్త మల్లేశ్, కిట్టు, పల్లె అనిల్ తదితరులున్నారు.

## నాసిరకంగా అండర్‌డ్రైన్, సీసీ రోడ్ల నిర్మాణ పనులు

మంథని, ఫిబ్రవరి 7: పట్టణంలోని పలు వీధుల్లో కొనసాగుతున్న అండర్‌డ్రైన్, సీసీ రోడ్ల పనులు నాసిరకంగా కొనసాగుతున్న పట్టణ వాసులు ఆరోపిస్తున్నారు. మంథని పట్టణ సుందరీకరణ పనుల్లో భాగంగా 13 వార్డుల్లో నూతన సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులు నిర్వహిస్తున్న విషయం విధితమే. అయితే పలు వార్డుల్లో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా తమ పనులు చక చకా ముగిస్తుండటంతో నాణ్యత లోపం కొట్టొచ్చినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. స్థానిక నడివీధి నుంచి మందాటకు వెళ్లే దారిలో అండర్ డ్రైనేజీ నాసిరకంగా నిర్మించడంతో పగుళ్లు తేలాయి. పలు వీధుల్లో సైతం రహదారులకు సరిగ్గా క్యూరింగ్ చేయక పోవడంతో పగుళ్లు ఏర్పడుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. పట్టణంలో కొనసాగుతున్న అండర్‌డ్రైన్, సీసీ రోడ్ల పనులను మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నాణ్యత లోపం లేకుండా నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


పగుళ్లు తేలిన అండర్ డ్రైన్

## బాధ్యతల స్వీకరణ

ధర్మారం,ఫిబ్రవరి7: ధర్మారం తాసిల్దార్ మహ్మద్ వకీల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కాల్వశ్రీరాంపూర్ నుంచి ధర్మారానికి బదిలీపై వచ్చారు. నూతన తహసీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

## నీటి ఎద్దడి లేకుండా చూడాలి

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 7: వేసవిలో తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రామ్మోహనాచారి తెలిపారు .పెగడపల్లిలోని మంచినీటి ట్యాంకును శుక్రవారం పరిశీలించారు. ఇక్కడ ఎంపీవో కిరణ్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## అలీ అకాల మృతి తీరని లోటు

అంతర్గాం, ఫిబ్రవరి 7: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా అంకితభావంతో పని చేసిన ఎంపఅలీ అకాల మృతి తీరని లోటని అంతర్గాం మండల తహసీల్దార్ తూము రవీందర్ పటేల్ అన్నారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో అలీం సంతాప సభ నిర్వహించారు. తహసీల్దార్ హాజరై అలీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి రవూఫ్ ఖాన్, ఎంపీడీవో వేణుమాధవ్, సూపరింటెండెంట్ కరుణాకర్, ఉపాధి హామీ ఏపీవో రమేష్, సిబ్బందితో పాటు అలీం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అంతర్గాం, ఫిబ్రవరి 7: అంతర్గాం మండలంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శంకర్ ప్రకటనలో తెలిపారు. ప్రతి నెల రెండో శనివారం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నాం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొనారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఓసీపీ 5 తనిఖీ

గోదావరిఖని, ఫిబ్రవరి 7: జీడీకే ఓసీపీ 5 ఉపరితల గనిని శుక్రవారం కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్ తనిఖీ నిర్వహించారు. రక్షణపై తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. గని వ్యూపాయింట్ నుంచి డంప్‌యార్డును పరిశీలించి డంప్ ఎడ్జ్ బెర్మ్‌లు టైర్ కన్నా ఎత్తుగా ఉండాలని సూచించారు. రక్షణ పట్ల చేపట్టాల్సిన ప్రణాళికల గురించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇక్కడ రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం కేమెచ్ఎన్ గుప్తా, ప్రాజెక్టు ఆఫీసర్ కే చంద్రశేఖర్, ఇంజినీర్ రమేశ్, షిఫ్ట్ ఇన్‌చార్జిలు జీ రమేశ్, ఎన్ సంతోశ్, తదితరులు ఉన్నారు.

## సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది

మంథని, ఫిబ్రవరి 7: 108 సిబ్బంది సీపీఆర్ చేసి ఓ వృద్ధురాలి ప్రాణాలు కాపాడారు. మంథని మండలం భట్టుపల్లి గ్రామానికి చెందిన అడిగొప్పుల రాజమ్మ ఇంట్లో నిలువ చేసిన డీజిల్‌ను అనుకోకుండా సేవించింది. దీంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది ఆమెను మొదటగా మంథని ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. వైద్యుల సూచనల మేరకు గోదావరిఖని తరలిస్తుండగా మార్గమధ్యలో ఆమె గుండె ఆగి పోయింది. దీంతో అప్రమత్తమైన మెడికల్ టెక్నీషియన్ శ్రీనివాస్ సీపీఆర్ చేసి వృద్ధురాలి గుండె తిరిగి కొట్టుకునేలా చేశారు. ఆనంతరం ఆమెను గోదావరిఖని దవాఖానలో చేర్పించారు.

## కామన్ మెనూ అమలు చేయాలి

అంతర్గాం, ఫిబ్రవరి 7: విద్యార్థినులకు కామన్ మెనూ డైట్ కట్టుదిట్టంగా అమలు చేయాలని స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ అరుణశ్రీ పేర్కొన్నారు. రామగుండంలోని ఎస్సీ బాలికల గురుకులంలో నైట్ హాల్ట్ నిర్వహించిన అదనపు కలెక్టర్ గురుకులంలోని డార్మెటరీ, తరగతి గదులు, పారిశుధ్య నిర్వహణ, భోజనశాల, వంటగదిని తనిఖీ చేశారు. బాలికలతో మాట్లాడి భోజన వసతి, నాణ్యత, పారిశుధ్య నిర్వహణ, విద్యబోధనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆదనపు కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ విద్యాలయాల నిర్వహణను పర్యవేక్షించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు నైట్‌హాల్ట్ కార్యక్రమాన్ని చెపట్టినట్లు తెలిపారు. స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

## మద్యం తాగి ఇద్దరు మృతి

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 7: అతిగా మద్యం సేవించి ఇద్దరు వేర్వేరుగా మృతిచెందిన సంఘటన శుక్రవారం గోదావరిఖనిలో జరిగింది. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక జవహర్‌నగర్‌కు చెందిన మేద శ్రావణ్‌కుమార్(33) అతడు మద్యం తాగి ఇంట్లో మృతిచెందాడు. మృతుని తల్లి మేద సుగుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రమేశ్ కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, స్థానిక ఫైవింక్లైన్ మోరి వద్ద బచ్చల సాంబయ్య (45) అనే వ్యక్తి మద్యం తాగి మృతిచెందాడు. మృతుడి భార్య తార ఫిర్యాదు మేరకు ఎస్ఐ భూమేశ్ కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

## డీపీవో విస్తృత పర్యటన

ధర్మారం,ఫిబ్రవరి7: డీపీవో,మండల ప్రత్యేక అధికారి వీర బుచ్చయ్య శుక్రవారం ధర్మారంలో విస్తృతంగా పర్యటించారు. జక్కన్నపల్లిలోని ఎస్టీ బాలికల గురుకుల విద్యాలయాన్ని సందర్శించారు. వసతి గృహంలో సమస్యలను ప్రిన్సిపాల్ శ్రీలతను అడిగి తెలుసుకున్నారు.హాస్టల్ ఆవరణలో నిర్మిస్తున్న డైనింగ్ హాల్ షెడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి మోడల్ నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఆ తర్వాత మండల పరిషత్ కార్యాలయంలో జీపీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఇంటి పన్నుల వసూలు లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఇక్కడ ఆయన వెంట ఎంపీడీవో ఐనాల ప్రవీణ్ కుమార్, ఎంపీవో రమేశ్,పీఆర్ ఏఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.